సాక్షి
చిత్తూరు
మంగళవారం ı 16 ı జూలై ı 2024



'దొంగ' మేస్త్రీ!
చోరీల్లో మహా ముదురైన ఓ దొంగోడు పోలీసులకు పట్టుబడ్డాడు. నాలుగు జిల్లాల్లో ఏకంగా 50 బైకులు కొట్టేశాడు. - 8లో



పకడ్బందీగా ఇంటింటా కుష్ఠు సర్వే
జిల్లాలో కుష్ఠు నివారణకు సర్వే పకడ్బందీగా చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. - 8లో



బోల్తా పడ్డ మామిడి టెంపో
మామిడి కాయల లోడుతో వెళ్తున్న టెంపో పలమనేరు -కుప్పం జాతీయ రహదారిలో కనుమలదొడ్డి వద్ద బోల్తా పడింది. - 8లో

- చిత్తూరు జిల్లాలోని పూతలపట్టు గురుకుల పాఠశాలలో 458 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు ఏర్పడితే ఇక అంతే. పాఠశాలలో హెల్త్ సూపర్‌వైజర్ కేడర్‌లో ఒకరే విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రాకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ కష్టతరంగా ఉందని నిర్వాహకులు వాపోతున్నారు.

- తిరుపతి జిల్లాలోని నాయుడుపేట గురుకుల పాఠశాలలో 520 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆ పాఠశాల ప్రాంగణంలోకి వెళితే ముక్కు మూసుకోవాల్సిందే. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. ఎక్కడబడినా మలమూత్ర విసర్జనే కనిపిస్తోంది. పాఠశాల మొత్తం దుర్గంధ భరితంగా మారింది. పాఠశాలలో ఒక స్టాఫ్ నర్స్ విధులు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ ఆరోగ్య చికిత్సలు చేయడం లేదు.



నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

.. ఇది ఒక్క పూతలపట్టు, నాయుడుపేట గురుకులాల పరిస్థితే కాదు.. ఉమ్మడి జిల్లాలోని ప్రతి గురుకులంలోనూ ఇదే దుస్థితి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పరిస్థితి తారుమారైంది. పాఠశాలలు తెరిచి నెలరోజులైనా పైసా విదల్చకపోవడంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్థంగా తయారైంది. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నా సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అటువైపు కనెత్తి చూడకపోవడం విద్యార్థులకు శాపంగా మారింది.

గురుకులం.. కల్లోలం





నీరసిస్తూ..నిరీక్షిస్తూ



గురుకులంలో వైద్యసేవలందిస్తున్న సిబ్బంది



విద్యార్థిని ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

సమస్యలతో సతమతమవుతున్న గురుకుల పాఠశాలలు

- అధ్వానంగా పారిశుద్ధ్యం నిర్వహణ
- కలుషిత ఆహారం, తాగునీరే విద్యార్థులకు గతి
- చెబితే ఏమవుతుందోనని భయపడుతున్న పిల్లలు
- పట్టించుకోని ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం

చిత్తూరు కలెక్టరేట్/ సూళ్లూరుపేట/ తిరుపతి తుడా: గురుకుల పాఠశాలల సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యం వెరసి విద్యార్థులకు శాపంగా మారింది. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నారు. విద్యాబుద్ధులు అటుంచితే కనీస సౌకర్యాలు కల్పించడంలో చతికిల పడుతున్నారు. పారిశుద్ధ్యం, నాణ్యమైన ఆహారం విషయాన్ని గాలికొదిలేస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు తరచూ వ్యాధులబారిన పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మరికొందరు తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రులపాలవుతున్నారు. కూటమి నేతలతోపాటు సంబంధిత అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పారిశుద్ధ్యం పట్ల అలసత్వం

ఒక్కో గురుకుల పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులకు పైగా చదువుతుంటారు. చాలా పాఠశాలల్లో బ్లీచింగ్, ఫినాయిల్, పొరకలు లాంటివి కూడా చాలినన్ని లేక సిబ్బంది అల్లాడాల్సి వస్తోంది. ఇక గత ప్రభుత్వంలో తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లు చాలా పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. అలాగే నాడు–నేడు ద్వారా పాఠశాలలు, బాత్‌రూమ్‌ల రూపురేఖలు మారాయి. కానీ నెల రోజులుగా వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇక వంట గదుల నిర్వహణ గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. దోమల నివారణకు నెలకోసారి కూడా ఫాగింగ్ లాంటి చర్యలు చేపట్టడంలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
చిత్తూరు	07	3,367
తిరుపతి	10	6,436

జాడలేని వైద్యులు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను వారానికి ఒకసారి వైద్యులు పరిశీలించాల్సి ఉంటుంది. ప్రతి గురుకుల పాఠశాలలో వైద్యచికిత్సలకు సంబంధించి ప్రత్యేక రిజిస్టర్‌ను అమలు చేయాలి. ఆ నిబంధనలను చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

అరకొరగా దుప్పట్లు

గురుకుల పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి ఒక దుప్పటి, కార్పెట్ ఇవ్వాలి. అయితే రెండు జిల్లాల్లోని 17 పాఠశాలల్లో 25 శాతం మాత్రమే దుప్పట్లు, కార్పెట్లను సరఫరా చేశారు. రాత్రుల్లో దోమల బాధ, చలికి తట్టుకోలేక విద్యార్థులు అల్లాడిపోతున్నారు. ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లనే నేలపై పరిచి నిద్రించాల్సిన దుస్థితి ఏర్పడుతోందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.



నాయుడుపేట ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న విద్యార్థులు

ఏడుగురికి తీవ్ర అస్వస్థత

నాయుడుపేట బాలుర గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం కారణంగా 139 విద్యార్థులు అస్వస్థతకు గురికాగా అందులో ఏడుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. గురుకుల పాఠశాలలో 520 మంది విద్యార్థులుండగా 139 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు విద్యార్థులు వాంతులు, విరేచనాలతో నీరసపడిపోయారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆందోళనతో గురుకుల పాఠశాలకు పరుగులు తీశారు. 108 అంబులెన్స్ ద్వారా నాయుడుపేట, సూళ్లూరుపేట కమ్యూనిటి ఆస్పత్రులకు విద్యార్థులను తరలించారు. గూడూరు ప్రాంతీయ ఆస్పత్రికి మరికొంతమందిని తరలించారు. తీవ్ర అస్వస్థతకు గురైన ఏడుగురిని నెల్లూరు జీజీహెచ్ ఆస్పత్రికి తరలించారు.

ప్రజాప్రతినిధులు, అధికారుల పరామర్శ

విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో సాంఘిక సంక్షేమశాఖా మంత్రి డోల శ్రీబాలవీరాంజనేయులు, ఎంపీ మద్దిల గురుమూర్తి, కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను పరామర్శించారు. గురుకులంలో పడకేసిన పారిశుద్ధ్యంపై మండిపడ్డారు. హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం కారణంగా ఇలా జరిగిందని, వార్డెన్ స్థానికంగా నివాసం ఉండడం లేదని తెలిపారు.

విచారణ చేస్తున్నాం

"నాయుడుపేట ఘటనపై సమగ్రంగా విచారణ నిర్వహిస్తున్నాం. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ప్రత్యేక చర్యలు చేపడుతాం. ప్రతి పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యనివ్వాలని ప్రిన్సిపల్స్‌ను ఆదేశించాం.
– పద్మజ, అంబేడ్కర్ గురుకుల పాఠశాలల జిల్లా కో–ఆర్డినేటర్, ఉమ్మడి చిత్తూరు జిల్లా

కలచివేసింది



ఆస్పత్రిలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి

నాయుడుపేట టౌన్: నాయుడుపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులంలో విద్యార్థులు కలుషిత ఆహారం తిని 139 మందికి పైగా అస్వస్థతకు గురికావడం ఎంతో కలచివేసిందని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని గురుకులాన్ని ఆయన సోమవారం సాయంత్రం సందర్శించి అక్కడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై డీఎంఅండ్‌హెచ్‌ఓ శ్రీహరి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి పద్మజ, సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని, వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. గురుకులంలో పరిస్థితులను తెలుసుకున్నారు. విద్యార్థులకు సత్వరం మెరుగైన వైద్యసేవలందించాలని కోరారు. అనంతరం ఎంపీ విలేకర్లతో మాట్లాడుతూ తిరుపతి జిల్లా పరిధిలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఎంపీ నిధులతో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తామన్నారు. పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల తదితర వాటికి సంబంధించి కూడా ఎంపీ నిధులు కేటాయిస్తామని చెప్పారు. తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గురుకులాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఎంపీతోపాటు నాయకులు పోట్లపూడి రాజేష్, రవీంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

బాధాకరం



విద్యార్థులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేట బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురికావడం బాధాకరమని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన నాయుడుపేట సామాజిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ శ్రీహరితోపాటు సూపరింటెండెంట్ చంద్రకళతో మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యంతోపాటు విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చారనానరు. కోట్లాది రూపాయలతో ప్రభుత్వ వైద్యశాలల స్థితిగతులను మార్చారన్నారు. ఈ క్రమంలోనే విద్యార్థులకు మెరుగైన వైద్యం అందేందుకు దోహదపడిందన్నారు. కొంతమంది వైద్యశాలలో పడకలు లేవని మాట్లాడడం అర్థరహితమన్నారు. సూళ్లూరుపేట, నాయుడుపేట పట్టణాల్లో సామాజిక ఆరోగ్య కేంద్రాలను అత్యాధునిక హంగులతో నిర్మించినట్టు వెల్లడించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, మండల మాజీ కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, బైనా మల్లికార్జున్‌రెడ్డి, కటకం జయరామయ్య, ధారా రవి, చదలవాడ కుమార్, సునిల్, తన్నమాల రమణయ్య, ముత్యాల్‌రెడ్డి పాల్గొన్నారు.



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కలెక్టర్



చిల్లకూరు : సిబ్బందితో తల్లిదండ్రుల వాగ్వాదం

15 రోజుల్లో 40 మందికి అస్వస్థత

ఒక విద్యార్థిని మృతి..



చికిత్స పొందుతున్న విద్యార్థులు

చిల్లకూరు: గూడూరు, నాయుడుపేట డివిజన్‌లలోని గురుకులాల్లో గత 15 రోజుల్లోనే ఒక విద్యార్థిని మృతి చెందగా 140 మంది విద్యార్థులు కలుషిత ఆహారం, నీరు తాగి అస్వస్థతకు గురయ్యారు. ఇటీవల గూడూరు మున్సిపల్ పరిధిలోని చెన్నూరు ఎస్టీ గురుకుల పాఠశాలలో తాగునీరు కలుషితమై 18 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మూడు రోజుల పాటు ఆస్పత్రిలో ఉండి చికిత్స పొందారు. రెండు రోజుల క్రితం డక్కిలి మండలంలోని బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదివే ఓ విద్యార్థిని తీవ్ర జ్వరంతో అస్వస్థతకు గురయ్యారు. ఆపై చెన్నై ఎగ్మూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. నాయుడుపేట బాలుర గురుకుల పాఠశాలలో శనివారం రాత్రి తయారు చేసిన అల్పాహారాన్ని ఆదివారం ఉదయం విద్యార్థులకు వడ్డించారు. దీంతో 120 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

నాయుడుపేట గురుకులంలో పరిస్థితి ఇదీ



ఇక్కడ వార్డెన్‌తోపాటు ఆరుగురు వంట నిర్వాహకులు ఉన్నారు. శానిటేషన్ సూపర్‌వైజర్‌తోపాటు ఆరుగురు స్వీపర్లు పనిచేస్తున్నారు. గురుకులంలో 850 మంది విద్యార్థులకు గాను 96 మరుగుదొడ్లు ఉన్నాయి. స్నానాల గదులు ప్రత్యేకంగా ఉన్నాయి. కానీ ఇవన్నీ మలవిసర్జనతో దుర్గంధభరితంగా దర్శనమిస్తున్నాయి. పాఠశాలలో వంటశాలలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. విద్యార్థులు భోజనం చేసే గది అపరిశుభ్రంగా ఉంది.

విజృంభిస్తున్న విషజ్వరాలు

తిరుపతి జిల్లా వ్యాప్తంగా విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. తిరుపతి, శ్రీకాళహస్తి, నాయుడుపేట, రేణిగుంట, పుత్తూరు, తిరుపతి రూరల్ మండలాల్లో విషజ్వరాలు తాండవిస్తున్నాయి. సీజనల్ వ్యాధులు సైతం పంజా విసురుతున్నాయి. వారం రోజుల క్రితం తిరుపతి రూరల్ మండలంలోని ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహించే మానసిక వికలాంగుల వసతి గృహంలో కలుషిత తాగునీరు సేవించడంతో 19 మంది ఆస్పత్రి పాలయ్యారు. విరోచనాలు, వాంతుల భారినపడి అందులో ఇద్దరు మానసిక వికాలంగులు మృత్యువాత పడ్డారు. అలాగే ఇటీవల డక్కిలి మండలంలో డయేరియాతో ఒకరు మృత్తి చెందారు. డక్కిలి, నాయుడుపేట గురుకుల పాఠశాలలు, అనాథ ఆశ్రమం, స్లమ్ ఏరియాల్లో ఫుడ్ పాయిజన్ కారణంగా సుమారు 230 మందికిపైగా అనారోగ్యం భారిన పడ్డారు. వారిలో ఏడుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ముఖ్యంగా తిరుపతి పట్టణంలో డెంగీ జ్వరాలు తీవ్రరూపం దాల్చాయి. ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట ప్రణాళిక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

- కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, ఎస్పీ మణికంఠ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట ప్రణాళికను అమలు చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటి వరకు 379 రోడ్డు ప్రమాదాలలో 170 మంది వరకు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారులలో ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతాలు 26 ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ఆ ప్రాంతాలలో ప్రమాదాల నివారణకు నేషనల్ హైవే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారుల వెంట ఉన్న పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో పనిచేసే డాక్టర్లు ప్రమాదాల బారిన పడే క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. అవసరమైన రక్తాన్ని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జిల్లా ఆసుపత్రిలో అవసరమైన పడకలను ఏర్పాటు చేయాలన్నారు. సరైన వైద్యం అందలేదనే ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రమాదాలలో మరణించిన వారికి సంబంధించిన ధ్రువపత్రాలు, క్లెయిమ్స్ పరిష్కారంలో ఆర్డీఓలు, తహసీల్దార్లు సత్వరమే స్పందించి న్యాయం చేయాలని ఆదేశించారు. ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ, జిల్లాలో ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను తప్పక పాటించాలన్నారు. ద్విచక్రవాహనం నడిపే సమయంలో ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని కోరారు. యువత అతివేగంగా వాహనాలు నడపరాదని హితవు పలికారు. అడిషనల్ ఎస్పీ అరీఫుల్లా, డీటీసీ నిరంజన్‌రెడ్డి, ఎన్‌హెచ్‌పీడీ కార్తీకొరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదుపై విచారణ



బాధితుల సమస్యలు ఆలకిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి ఫిర్యాదుపై అధికారులు విచారణ చేయాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశించారు. సోమవారం చిత్తూరులోని ఆర్ముడు రిజర్వు కార్యాలయంలో ప్రజల నుంచి ఎస్పీతోపాటు ఏఎస్పీ ఆరీపుల్లా, దిశ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. గొడవలు, భూ సమస్యలు, వేధింపులు, ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. సకాలంలో వీటిని విచారణ చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు.

మీ ఆప్తుల అంత్యక్రియలు, నిర్యాణం సమాచారం
వర్ధంతి, జయంతిల నివాళులు ప్రకటనల కోసం సంప్రదించండి.

మీ ఉన్నతికై శ్రమించిన ఆత్మీయుల జ్ఞాపకాలు, నివాళులు బంధుమిత్రులకు మరియు శ్రేయోభిలాషులకు సమాచారం తెలియజేసే అవకాశం.
సాక్షి దినపత్రికలో అంతిమయాత్ర, శ్రద్ధాంజలి, వర్ధంతి, జ్ఞాపకార్థం తదితర ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో వున్నారు.
సాక్షి
డిస్కౌంట్
SAKSHI
99122 20586, 97054 44179
Mail id: tptadvtsakshi@gmail.com

క్లుప్తంగా

ఇసుక అక్రమ రవాణాకు బ్రేక్

- అడ్డుకుని ట్రాక్టర్లను వీఆర్వోకు అప్పగించిన యువత



యువకులు పట్టుకుని అప్పగించిన ఇసుక ట్రాక్టర్లు

నగరి : మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం వద్ద కుశస్థలి నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను యువకులు పట్టుకున్న సంఘటన సోమవారం తెరణి దళితవాడ వద్ద చోటుచేసుకుంది. తెరణి దళితవాడకు సంబంధించిన శ్మశానానికి వెళ్లే దారిలో ఇసుకను పూర్తిగా తవ్వేసి లోడ్ చేసుకుంటున్న రెండు ట్రాక్టర్లను దళితవాడ యువకులు గుర్తించారు. ప్రభుత్వం స్టాక్ పాయింట్ నిర్దేశించని ప్రాంతాల్లో ఇసుకను ఎలా తరలిస్తారంటూ వారిని ప్రశ్నించారు. తహసీల్దార్‌కు సమాచారం చేరవేయడంతో ఆయన స్పందించారు. వీఆర్వోను సంఘటనా స్థలానికి పంపడంతో యువకులు ఆ ఇసుక ట్రాక్టర్లను ఆయనకు అప్పగించారు. ఇక్కడ రేయింబవళ్లు ఇసుక తరలిస్తున్నారని, దీనిని కట్టడి చేయాలని వీఆర్వోను కోరారు. మరోమారు ఇసుక తరలింపు కొనసాగితే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇదలా ఉంచితే, తెలుగుదేశం పార్టీ మద్దతుదారులే ఇక్కడ ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్టు సమాచారం. వారం రోజుల నుంచి ఇక్కడ దర్జాగా ఇసుకను తరలిస్తున్నట్టు తెలిసింది.

మళ్లీ సర్వర్ సమస్య

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సర్వర్ సమస్య వెంటాడుతూనే ఉంది. గత గురు, శుక్రవారాలు సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడం విదితమే. రెండో శనివారం, ఆదివారం సెలవు రోజులు కావడంతో పెండింగ్ పత్రాల రిజిస్ట్రేషన్‌కు సోమవారం ప్రజలు విరివిగా రావడంతో కార్యాలయం కిక్కిరిసింది. అయితే ఉదయం నుంచి సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడం పడిగాపులు కాశారు. ఎట్టకేలకు సాయంత్రం నుంచి నెమ్మదిగా పనిచేయడంతో రిజిస్ట్రేషన్లకు పరుగులు తీశారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు: తమ కళాశాల కంప్యూటర్ విభాగంలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వై.రాజశేఖర్ సోమవారం తెలిపారు. అభ్యర్థులు మాస్టర్స్ డిగ్రీ, ఎంసీఏ, ఎంటెక్ 55 శాతం మార్కులతో పాసైన వారు, నీట్, సెలెక్ట్, పీహెచ్‌డీ, అధ్యాపక అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు చెప్పారు. ఆసక్తి గల వారు ఈనెల 19లోపు దరఖాస్తు చేయాలన్నారు.

దొంగ మేస్త్రీ!

చోరీల్లో మహా ముదురైన ఓ దొంగోడు పోలీసులకు పట్టుబడ్డాడు. పగలు మేస్త్రీ అవతారం ..చీకటి పడితే దొంగావతారం. ఏదైనా మోటార్ సైకిల్‌పై కన్నేశాడా..!? ఇక అంతే.. అది మాయం కావాల్సిందే! ఇలా ఒకటీ కాదు..రెండూ కాదు..ఏకంగా 50 మోటార్ సైకిళ్లు కొట్టేశాడు. ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు అన్నమయ్య, నెల్లూరు జిల్లాలో ఈ చోరాగ్రేసరుడు ఫ్యామిలీ ప్యాకేజ్ అనే లెవెల్లో కుటుంబ ప్రమేయంతోనూ కొన్ని చోరీలు చేసినట్టు తెలిసింది.

కన్ను పడిందా.. బైక్ గోవిందా!

- పూతలపట్టులో ఘరానా మోటార్ సైకిళ్ల దొంగ అరెస్ట్
- రూ.45 లక్షల విలువ చేసే 50 మోటార్ సైకిళ్లు స్వాధీనం
- చోరీల్లో వీడు మహాముదురు
- వివిధ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మణికంఠ చందోలు



ద్విచక్రవాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ, డీఎస్పీ

పూతలపట్టు : ఓ మోటార్ సైకిళ్ల దొంగను అరెస్ట్ చేసి రూ.45లక్షల పైచిలుకు విలువ చేసే వివిధ రకాల 50 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ మణికంట చందోలు వెల్లడించారు. సోమవారం పూతలపట్టు పోలీస్ స్టేషన్‌లో ఆయన మీడియాకు తెలిపిన వివరాలు..

ఆదివారం మండలంలోని రంగంపేట క్రాస్ వద్ద సీఐ సుదర్శన ప్రసాద్ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేశారు. మోటార్ సైకిల్‌పై వచ్చిన ఓ యువకుడు వీరిని చూసి పరారయ్యాడు. అనుమానించిన పోలీసులు అతడిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. బైక్‌కు సంబంధించి పత్రాలు చూపమని కోరితే..తాను నడిపిన బైక్ పూతలపట్టులో దొంగిలించినట్లు చెప్పాడు. అతడిని అదుపులోకి తీసుకుని పోలీసులు తీగ లాగితే చోరీల డొంకంతా కదిలింది. విచారణలో అతడు నెల్లూరు జిల్లా ముదివర్తివారిపల్లెకు ముసళ్ల సందీప్ సాయి (24) అని, గూడూరు, ఇందుకూరుపేట, నెల్లూరు రూరల్, భాకరాపేట, ఓజిలి, పీలేరు, తిరుపతి, పుల్లంపేట, శ్రీకాళహస్తి, పాకాల, పూతలపట్టు , కాణిపాకం తదితర ప్రాంతాల్లో బైకులు చోరీ చేసినట్లు తేలింది. అతడి నుంచి రాబట్టిన సమాచారంతో మొత్తం 50 చోరీ బైకుల్ని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బైకుల్లో స్ప్లెండర్: 21, పల్సర్: 7, యూనికార్న్ : 4, రాయల్ ఎన్‌ఫీల్డ్: 4, గ్లామర్: 11, షైన్: 2, ఫ్యాషన్ ప్రో: 1 చొప్పున ఉన్నట్టు ఎస్పీ వెల్లడించారు. ఇక కేసుల పరంగా చూస్తే..నెల్లూరు రూరల్ 2, రేణిగుంట 4, వడలమాలపేట 5, నాయుడుపేట, 1, నవాబ్‌పేట 2, ఇందుకూరుపేట 6, బుచ్చి 5, ఏర్పేడు 3, పెనగలూరుపేట 2 చొప్పున ఆయా పోలీస్ స్టేషన్లలో ఇతడిపై కేసులు నమోదై ఉన్నట్టు చెప్పారు. అలాగే 15 పెండింగ్ కేసులు సైతం అతడిపై ఉన్నాయని పేర్కొన్నారు.

ఫ్యామిలీ ఓ దొంగల ముఠా!

సందీప్ కుటుంబ సభ్యులంతా చోరీల్లో ఘనాపాటీలేనని తెలిసింది. తన తండ్రి శీనయ్య అలియాస్ సంతోష్‌తో కలిసి సందీప్ కొన్ని చోరీలు చేసినట్లు విచారణలో పోలీసులకు వెల్లడించినట్టు తెలియవచ్చింది. చోరీ చేసిన మోటార్ సైకిళ్లను కుదువ పెట్టడం, తక్కువ ధరకు విక్రయించి జల్సాలు చేసేవారని తెలుస్తోంది. ప్రస్తుతం సందీప్ ఒక్కడినే పోలీసులు అరెస్ట్ చేసినప్పటికీ చోరీలతో ప్రమేయం ఉన్న అతడి తండ్రి, కుటుంబ సభ్యులను కూడా అరెస్ట్ చేసే అవకాశం లేకపోలేదు. ఇక, సందీప్ భవన నిర్మాణ పనుల్లో మేస్త్రీగా పనిచేస్తూ, వీలున్నప్పుడల్లా బైకులు చోరీ చేసేవాడని విచారణలో తేలింది.



సీఐ సుదర్శన ప్రసాద్‌కు ప్రశంసా పత్రం ఇస్తున్న ఎస్పీ

ఎస్పీ నుంచి ప్రశంసాపత్రాలు

బైకుల చోరీ కేసును ఛేదించిన సీఐతోపాటు యాదమరి ఎస్ఐ రామాంజనేయులు, ఏఎస్ఐ దేవరాజుల రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రవికుమార్, కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి, ముక్తీశ్వర్, సుబ్రమణ్యం, గణేష్, ప్రసాద్, సతీష్‌లకు ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'కడా'..ఉద్యోగులకు దడ!

- ప్రాజెక్టులో పనిచేసేందుకు ససేమిరా అంటున్న అధికారులు
- సిబ్బంది నియామకంపై తర్జన భర్జన
- సర్దుబాటు చేసేందుకు అధికారుల మల్లగుల్లాలు

కుప్పం: కుప్పం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కడా) ప్రాజెక్టులో జిల్లా స్థాయి హోదా కలిగిన అధికారులను నియమించేందుకు ప్రస్తుత ప్రభుత్వం పూనుకుంది. నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఐఏఎస్ అధికారి వికాస్ మర్మట్‌ను ఇటీవలే కడా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమించడం విదితమే. ఇదే క్రమంలో ఆర్డీఓ హోదా అధికారిని డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా, అలాగే రెగ్యులర్ ఉద్యోగుల్లో ఒక తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు జూనియర్ అసిసెంట్లను ఇక్కడ నియమించేందుకు చర్యలు చేపట్టింది. వీరితో పాటు మరో 10 మందిని అటెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు 2, వాచ్‌మెన్లు ఇద్దరు, డ్రైవర్ ఒక పోస్టు చొప్పున ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించనున్నారు.

అంత ఆర్భాటమా?

కుప్పం నియోజకవర్గంలో 4 మండలాలు ఉన్నాయి. కడా ప్రాజెక్టు ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇంత పెద్ద సంఖ్యలో సిబ్బంది నియామకానికి పూనుకోవడం ఇదే తొలిసారి. గతంలో గ్రూప్ 1 లేదా ఆర్డీఓ స్థాయి అధికారిని నియమించి కడా అభివృద్ధి, అధికారులతో సమావేశాలు నిర్వహించేవారు. ఈసారి ఐఏఎస్ స్థాయి అధికారిని ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమించడం గమనార్హం! మరోవైపు డిప్యూటీ పీడీగా ఆర్డీఓ స్థాయి అధికారి నియామకానికి తర్జనభర్జన పడుతున్నారు. వీరితో పాటు ప్రాజెక్టుకు కావాల్సిన సిబ్బందిని సర్దుబాటు చేసేందుకు అధికారులు దృష్టి సారించారు.

అధికారులకు అగ్నిపరీక్షేనా?

పీడీని నియమించినా ఇతర సిబ్బంది నియామకమే అధికారులకు తలనొప్పిగా మారింది. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు.. కడాలో పనిచేందుకు ససేమిరా అంటున్నారు. వాస్తవానికి రెవెన్యూ శాఖ సంబంధిత అధికారులే ఎక్కువగా ఉన్నారు. కుప్పం నియోజకవర్గంలో పనిచేస్తున్న సిబ్బంది కడాలో పనిచేసేందుకు ఇష్టపడటం లేదు. ఈ నేపథ్యంలో రెవెన్యూ శాఖ ఉద్యోగులనే తీసుకుంటారా? ఇతర శాఖల నుంచి డెప్యుటేషన్‌పై నియామకాలు చేస్తారా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది.

19న లక్కీడిప్‌తో తోపు వేలం

పుత్తూరు: స్థానిక ద్రౌపదీ దేవి సమేత ధర్మరాజుల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయ తోపు లీజును (తాత్కాలిక అంగళ్ల నిర్వహణ) ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆగస్టు 11 అదే నెల 28వ తేదీ వరకు తోపులో తాత్కాలిక అంగళ్ల నిర్వహణ నిమిత్తం వేలం పాటను లక్కీడిప్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం మొత్తం రూ.10 లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.25 వేలు డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు. లక్కీడిప్‌లో పేరు వచ్చిన వారిని మినహాయించి మిగిలిన వారికి డిపాజిట్ తిరిగి చెల్లించబడదని స్పష్టం చేశారు. లక్కీడిప్‌లో పేరు వచ్చిన వారు వెంటనే మొత్తం రూ.10 లక్షలు చెల్లించి రశీదు పొందాలని నిర్వాహకుడు సాక్షాత్ కిష్టప్పమొదలి తెలిపారు.



ద్రౌపదీదేవి ఆలయం

డ్వాక్రా రుణాలు స్వాహా

–ఏపీఎంకు ఫిర్యాదు

తవణంపల్లె: మండలంలోని చెర్లోపల్లె పంచాయతీకి చెందిన ఉప్పాంక గ్రామంలో ప్రసన్నలక్ష్మి ఎస్‌హెచ్‌సీ గ్రూపు సంబంధించిన డ్వాక్రా రుణాలను సంఘమిత్ర, రెండవ గ్రూపు లీడరు స్వాహా చేశారని సోమవారం ప్రజా సమస్యల ప్రజావేదికలో ఏపీఎం రవికి ఫిర్యాదు చేశారు. చెర్లోపల్లె సంఘమిత్ర, ప్రసన్నలక్ష్మి ఎస్‌హెచ్‌సీ గ్రూపు రెండవ లీడర్ గ్రూపు సభ్యుల అనుమతి లేకుండా రూ.1.5లక్షలు బ్యాంకు లోను తీసుకుని స్వాహా చేశారని, దీనివల్ల గ్రూపులో లావాదేవీలు ఆగిపోయి పూర్తిగా నష్టపోతున్నామని సభ్యులు సుగుణ, భారతి, రామక్క, అనూష, రెడ్డెమ్మ, మీనా, లక్ష్మమ్మ, జ్యోతి, అమరావతి ఏపీఎంకు నివేదించారు. దీనిపై విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.



ఏపీఎం రవికి ఫిర్యాదు చేస్తున్న ప్రసన్నలక్ష్మి ఎస్‌హెచ్‌సీ గ్రూపు సభ్యులు

అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ
- వివిధ శాఖలకు 101 అర్జీలు
- కలెక్టరేట్ నుంచి క్షేత్రస్థాయి అధికారులకు బాధితులతో కలెక్టర్ ఫోన్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందే వినతులను పరిష్కరించే విషయంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ హెచ్చరించారు. వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 101 అర్జీలు అధికారులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఇక్కడ నమోదయ్యే అర్జీలను సంబంధిత శాఖల అధికారులు మొదటి ప్రాధాన్యతగా భావించి, నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

కలెక్టర్ వినూత్న ఒరవడి

అర్జీదారుల సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టర్ వినూత్న ఒరవడికి శ్రీకారం చుట్టారు. తన సెల్ నుంచి క్షేత్రస్థాయి అధికారులకు కాల్ చేసి బాధితులతో మాట్లాడించారు. బాధితులపై సమస్యలపై కలెక్టర్ అలా స్పందించి నేరుగా తమకే ఫోన్ చేస్తారని ఊహించని అధికారులు బెంబేలెత్తారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శాఖల వారీగా అందిన అర్జీలు

రెవెన్యూ శాఖకు సంబంధించి 94, పోలీస్ శాఖ 1, జిల్లా పౌరసరఫరాలు1, ట్రాన్స్‌కో 1, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ 1, జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ 1, డీఎంహెచ్‌ఓ (వైద్య శాఖ)1, సర్వ శిక్ష అభియాన్ 1 చొప్పున ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

అర్జీదారుల సమస్యల్లో కొన్ని..

కిడ్నీల సమస్య..నా భార్యకు పింఛను ఇవ్వరూ!

తన భార్య పద్మజా కుమారికి రెండు కిడ్నీలు పనిచేయడం లేదని కార్వేటినగరం మండలం విజయమాంబపురం గ్రామానికి చెందిన పి. విజయకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. చాలా ఏళ్లుగా మంచానికే పరిమితమైన తన భార్యకు పింఛన్ మంజూరు చేయాలని కోరారు.

అనుభవంలో ఉన్న భూములకు అటవీశాఖ అభ్యంతరం

ఎన్నో సంవత్సరాలుగా తమ అనుభవంలో ఉన్న భూములకు అటవీశాఖ అధికారులు అభ్యంతరం చెబుతున్నారని ఐరాల మండలం వేదగిరిపల్లెకు చెందిన యానాది కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యపై ఉన్నతాధికారులకు అర్జీ అందజేశారు. పూర్వీకుల నుంచి అనుభవంలో ఉన్న తమ భూమికి పట్టాలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో బాధితులు కుమారి, రమణయ్య, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

పింఛను సారూ!

పింఛను ఇప్పించాలని కోరుతూ రొంపిచెర్ల మండలం బొమ్మాయపల్లెకు చెందిన మంగమ్మ కోరారు. తనకు ఎడమ కన్ను పూర్తిగా కనిపించదని తెలిపారు. తిరుపతి, చిత్తూరు, మదనపల్లె ఏరియా ఆసుపత్రుల్లో వైకల్యం సర్టిఫికెట్ కోసం ఎన్నోసార్లు వైద్యులను సంప్రదించినా ఎవరూ తన గోడు పట్టించుకోలేదని, అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

మోటార్ సైక్లిస్టుకు గాయాలు

సదుం: రోడ్డు ప్రమాదంలో మోటార్ సైక్లిస్టు గాయపడిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం..పులిచెర్ల మండలం శ్రీనివాసపురానికి చెందిన బాలు స్వంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో గొడ్లవారిపల్లెకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో గ్రామంలో నుంచి ప్రధాన రహదారి పైకి వస్తూ అదుపుతప్పి ఐషర్ వాహనాన్ని ఢీకొని గాయపడ్డాడు. అతడిని ఆటోలో స్థానిక సీహెచ్‌సీకి తరలించారు.



ప్రమాదంలో గాయపడ్డ బాలు

బోల్తా పడ్డ మామిడి టెంపో



రోడ్డుపై పరచుకున్న మామిడి కాయలు

శాంతిపురం: మామిడి కాయల లోడుతో వెళ్తున్న టెంపో బోల్తా పడిన సంఘటన సోమవారం తెల్ల వారుజామున పలమనేరు –కుప్పం జాతీయ రహదారిలో కనుమలదొడ్డి(ఏడవ మైలు) వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. కర్ణాటకలో ని రాజుపేటరోడ్డు నుంచి తమిళనాడులోని కావేరిపట్నంకు మామిడి కాయల లోడుతో టెంపో బయల్దేరింది. వేగంగా వెళ్తున్న టెంపోకు ఇతర వాహనాలేవీ అడ్డు రాకున్నా అనూహ్యంగా ప్రమాదానికి గురైంది. మొరసనపల్లె క్రాస్–కనుమలదొడ్డి మధ్య బోల్తా కొట్టి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో జాతీయ రహదారిలో దాదాపు అరగంట పాటు వాహనాల రాకపోక లు స్తంభించాయి. కిలోమీటర్ల పొడవునా వాహనాలు నిలిచిపోయాయి. అదృష్టవశాత్తు టెంపో డ్రైవర్ స్వల్పగాయాలతో బైటపడ్డాడు. స్థానికులు స్పందించి, రోడ్డుకు అడ్డుగా ఉన్న టెంపోను, చెల్లాచెదురుగా రోడ్డంతా పడి ఉన్న తోతాపురి మామిడి కాయలను తొలగించారు. దీంతో ట్రాఫిక్ క్లియరైంది.

రెస్కో ఎండీ బాధ్యతల స్వీకరణ

కుప్పం: గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (రెస్కో) ఎండీగా సోమశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీ ఎస్పీడీసీఎల్ తిరుపతి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న సోమశేఖర్‌ను రెస్కో ఎండీగా బదిలీ అయ్యారు. ఆయన్ను రెస్కో సిబ్బంది స్వాగతం పలికారు.



సోమశేఖర్

పింఛను కోసం వృద్ధురాలి నిరీక్షణ

కుప్పం: ఎన్నో ఏళ్లుగా ఓ వృద్ధురాలికి వస్తున్న పింఛను గత నెల నుంచి అందడం లేదు. ఎందుకు ఆపేశారు? అని అడిగినా చెప్పేవారు లేరని వాపోతోంది. వివరాలు.. కుప్పం మండలం వానగుట్టపల్లెకు చెందిన గంగమ్మ భర్త సుబ్రమణ్యం పదేళ్ల కిత్రం భర్త మృతి చెందాడు. అప్పటి నుంచి గంగమ్మకు పింఛను ఇస్తున్నారు. గత నెల నుంచి ఆమెకు పింఛను నిలిపివేశారు. గతంలో ఇచ్చిన పింఛను పుస్తకాలతో మండల పరిషత్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తోంది. చివరకు తన సమస్యపై తెలిసిన వారి వద్ద అర్జీ రాయించుకుంది. సోమవారం ఎంపీడీఓకు వినతి పత్రం అందజేసింది. ఆయన పరిశీలించి ఎందుకు ఆగిపోయిందో తెలియజేస్తానని చెప్పారు.



పింఛను కోసం నిరీక్షిస్తున్న వృద్ధురాలు

పకడ్బందీగా ఇంటింటా కుష్ఠు సర్వే

–పోస్టర్ల ఆవిష్కరణలో కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో కుష్ఠు నివారణకు సర్వే పకడ్బందీగా చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. కుష్ఠు నివారణ అవగాహన పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు కుష్ఠు వ్యాధిపై ఇంటింటా సర్వే చేయడంతోపాటు జిల్లాలోని 64 పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్‌సెంటర్ల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతి దేవి మాట్లాడుతూ, స్పర్శలేని మచ్చలు, రాగి రంగులో మచ్చలు, చర్మం మందంగా మొద్దు బారినట్లు ఉండడం, కనుబొమ్మ వెంట్రుకలు రాలడం..మొదలైనవి కుష్ఠు లక్షణాలని, ఈ లక్షణాలతో ఎవరైనా బాధపడుతున్న పక్షంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కుష్ఠు రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా క్షేత్రస్థాయిలోని వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ మణికంఠ, డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్‌రెడ్డి, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రపెంటలో చిరుత సంచారం

–లేగదూడను చంపేసింది

పలమనేరు: మండలంలోని మండిపేట కోటూరు పంచాయతీ ఎర్రపెంట అటవీప్రాంతంలో ఆదివారం రాత్రి చిరుత సంచరించింది. గ్రామ సమీపంలోని పొలాల వద్ద కాపురముంటున్న ఇళ్ల వద్ద కట్టి ఉన్న ఓ లేగదూడపై దాడి చేసి చంపేసింది. గతంలో ఇక్కడికి సమీపంలోని పేర్నంబట్ సమీపంలోని ఎర్తాంగళ్‌లో చిరుత ఇంట్లోకి చొరబడి ఇంట్లో ఉన్న వారిని గాయపరచడం, అలాగే పలమనేరు–గుడియాత్తం అంతర్రాష్ట్ర మార్గంలో చిరుత పలుమార్లు కనిపించిందని పశువుల కాపరులు చెప్పడం విదితమే. ఇలా ఉండగా ఆదివారం రాత్రి చిరుత తమిళనాడు రాష్ట్రంలోని మోర్ధన ఫారెస్ట్ పరిధి లోంచి కొండిన్య అడవిలోకి వచ్చి దొమ్మరపాపమ్మ గుడి సమీపంలోని ఎర్రపెంట వైపు వెళ్లినట్టు తెలుస్తోంది. చిరుత సంచారంపై అటవీ సమీప గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. అయితే చిరుత సంచారం గురించి పలమనేరు ఫారెస్ట్ అధికారులకు తెలియపోవడం గమనార్హం!

వైఎస్సార్‌సీపీ నేత దాబా ధ్వంసం



ప్రవీణ్ దాబాను ధ్వంసం చేసిన దృశ్యం



భోరున విలపిస్తూ తన సన్నిహితులతో సెల్‌లో మాట్లాడుతున్న బాధితుడు మేడసాని ప్రవీణ్

సాక్షి టాస్క్‌ఫోర్స్: 'ఇంత దారుణమా.. ఇంత అరాచకమా..? గడిచిన ఐదేళ్ల కాలంలో నేను ఎవరికి ఏ హాని తలపెట్టలేదు. అందరికీ మేలు చేశాను. ఇంతకంటే దారుణం మరొకటి ఏముంది. నా తండ్రికి కేన్సర్, నాకు ఇద్దరు ఆడపిల్లలు ఈ రోజు నా కుటుంబం మొత్తాన్ని రోడ్డున పడేశారు..ఇంతకంటే మా కుటుంబం మొత్తం నిలబడుతాం.. మమ్మల్ని చంపేయండి' అంటూ వైఎస్సార్‌సీపీ నాయకుడు మేడసాని ప్రవీణ్ నాయుడు కన్నీటి పర్యంతమయ్యారు. చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లె పంచాయతీ పీలేరు–తిరుపతి జాతీయ రహదారి ఆనుకుని ఉన్న మేడసాని ప్రవీణ్‌కు చెందిన దాబా హౌస్‌ను ఆదివారం అర్ధరాత్రి జేసీబీల సాయంతో గుర్తు తెలియని వ్యక్తులు నేలమట్టం చేశారు. బాధితుడి వివరాల మేరకు.. చంద్రగిరి మండలం ఏజీపల్లెకు చెందిన మేడసాని ప్రవీణ్ నాయుడు వైఎస్సార్‌సీపీ నాయకుడు. ఆయన తన వ్యక్తిగత పనులపై ఆదివారం విజయవాడకు వెళ్లారు. ఆదివారం రాత్రి ఆయన భార్య దాబాను మూసుకుని వెళ్లారు. ఆమె వెళ్లిన వెంటనే సుమారు 25 మంది ముసుగులు ధరించి దాబా వద్దకు చేరుకున్నారు. విద్యుత్ సరఫరాను నిలిపివేసి, వారంతా దాబా హౌస్‌ను నేలమట్టం చేస్తుండడంతో అక్కడ పనిచేస్తున్న ఉత్తరాది వంట మనుషులు ప్రవీణ్‌తో పాటు ఆమె భార్యకు ఫోన్‌లో సమాచారం చేరవేశారు. ప్రవీణ్ భార్య తిరిగి దాబా వద్దకు వచ్చే దాబా మొత్తం నేలమట్టమైంది. సోమవారం విజయవాడ నుంచి వచ్చిన ప్రవీణ్ దాబాను పరిశీలించి కన్నీటి పర్యంతమయ్యారు. తన శత్రువులు ఎవరో దాబాను ధ్వంసం చేశారంటూ వాపోయారు. దాబా హౌస్‌లో ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజ్ హార్డ్ డిస్క్‌ను సైతం అపహరించినట్లు బాధితుడు మీడియాకు వివరించాడు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సోదరుడు చెవిరెడ్డి రఘునాథ రెడ్డి హుటాహుటిన దాబా వద్దకు చేరుకున్నాడు. బాధితులను పరామర్శించారు. ధైర్యం చెప్పారు.

ప్రాణం బలిగొన్న 'లారీ' హారన్!

నారాయణవనం: హఠాత్తుగా ఏదైనా శబ్దం వినిపిస్తే కొన్ని సందర్భాల్లో ఎవరైనా భయపడటం, గగుర్పాటుకు గురవడం సహజం. ఇది అందరికీ అనుభవమే. అటువంటి అనుభవం హఠాత్తుగా ఎదురవడంతో ఓ వివాహిత దుర్మరణం పాలైంది. ఈ విషాద సంఘటన సోమవారం మధ్యాహ్నం మండలంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం.. నాగలాపురం మండలం నందనంకు చెందిన భానుప్రియ(24) తన భర్తతో కలిసి స్కూటర్‌పై పుత్తూరుకు వచ్చింది. పని ముగించుకుని తిరుగు ప్రయాణమైంది. మార్గమధ్యంలో మండలంలోని పాలమంగళం సమీపంలో జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న లారీ హఠాత్తుగా హారన్ మోగించడంతో భానుప్రియ ఉలిక్కిపడి బైక్ నుంచి అదుపు తప్పి కింద పడిపోయింది. అదే సమయంలో వెనుక వస్తున్న టిప్పర్ లారీ భానుప్రియను ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. ఈ ప్రమాదంలో భానుప్రియ తల పూర్తిగా ఛిద్రమైంది. పోలీసులు కేసును నమోదు చేశారు. మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



మృతి చెందిన భానుప్రియ

సాక్షి క్లాసిఫైడ్స్

Education

COACHING

- TET-ENGLISH Coaching by S.V.Chalapathy free Demo on 14.07.2024, Time: 09.30 to 11 A.M at Madam Sarojana Kinder Garden School, 1st Cross, Srinagar Colony, Near Satyanarayana puram, Tirupati, ✆ 9652380850.

DIRECT FINAL YEAR

- Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA Regular/lateral entry 9381287629
- Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA Regular/lateral entry 9381287629

Real Estate

PLOTS FOR SALE

- 5 లక్షల 9999లకే హైవేకి ఆనుకొని తిరుపతి IISER ప్రక్కన ఫైనల్ అప్రూవ్ కల్గిన ప్లాట్లు అయోధ్య టౌన్ షిప్‌నందు కలవు. డైరెక్ట్ ఓనర్. 9502774175, 7995992114.
- Plots Available for Sale Tuda Approved Chandragiri - Tirupati Highway West, East Face Plots Available Near Shloka Birla School Contact Details: 7760448201

Wanted

- తిరుపతి నందు కొత్తగా ప్రారంభిస్తున్న NGO కొరకు Managers, Computer Operator, Incharges కావలెను. జీ:10-25 వేలు వరకు మహిళా అభ్యర్థులు మాత్రమే. 8186060777.
- ప్రముఖ Govt(R) Co కి మండలాల వారిగా పనిచేయుటకు ఆఫీస్ అసిస్టెంట్స్, మేనేజర్స్ కావలెను. అ: 10 - డిగ్రీ జీ: 28,000-85,000 ట్రైనింగ్ ఇవ్వబడును. ✆ 8008830057
- చిత్తూరు జిల్లా, పుంగనూరు మండలంలో ప్రముఖ లాడ్జి నందు పనిచేయుటకు రూమ్ బాయ్స్, స్కావెంజర్స్ చిత్తూరులో జ్యువెలరీ షాప్‌లో సేల్స్ గర్ల్స్‌గా పనిచేయుటకు ఎనీ సేల్స్ అనుభవం కలిగిన యువతులు కావలెను. సం.ప్ర: 9515130414, 9160152122.
- తిరుపతి Airport దగ్గర Dixon టెక్నాలజీ ప్రై.లి. నందు పనిచేయుటకు TV ప్రొడక్షన్‌లో Line ఆపరేటర్స్ (M/F) కావలెను. Age: 18 to 30K, 10th, Inter, ITI పాస్/ఫెయిల్, డ్యూటీ 8 గం॥, జీతం: 14000+ఇన్సెంటివ్స్ చేస్తే డబుల్ పేమెంట్. భోజనం+బస్సు సౌకర్యం ఫ్రీ. సంప్ర: 6305103552, 9581882886
- సూళ్ళూరుపేట ప్రముఖ పరిశ్రమకు ఎంప్లాయ్, సూపర్‌వైజర్, ప్యాకింగ్‌కు ఆడవారు, క్యాంటీన్‌లో కుక్ & హెల్పర్స్ కావలెను. ✆ 81427 61777, 92980 11777
- ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రం హోం వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం 15-28 వేలు. కాల్/ వాట్సప్ చేయగలరు. సంప్ర. సెల్ : 95026 15217
- కష్టపడేవారు కావలెను VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసు కొవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంట చేయువారు,RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000. ఫ్రీ రూం+భోజనం. HYD. 7995583999
- షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, హౌస్‌కీపింగ్ భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ. 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారులు తెలిపే రీతిగా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.